సాక్షి శ్రీకాకుళం
గురువారం | 14 | ఆగస్టు | 2025

ఆ ముగ్గురికి అరుదైన గౌరవం


కవిత వాసుపల్లి


అట్టాడ చరణ్


మల్లా రామ్‌గోపాల్ నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా నుంచి ఈ ఏడాది విశేషంగా గుర్తింపు పొందిన ముగ్గురు వ్యక్తులకు ప్రత్యేక గౌరవం లభించింది. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలోని రాజ్‌భవన్ (గవర్నర్ బంగ్లా)లో జరగనున్న కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకావాలని మేజర్ వాసుపల్లి కవిత, వాలీబాల్ చాంపియన్ అట్టాడ చరణ్, కీర్తిచక్ర అవార్డు గ్రహీత మల్లా రామ్‌గోపాల్‌నాయుడులకు ఆహ్వానం అందింది. ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు జరిగే ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నుంచి ముగ్గురికి ఆహ్వానం అందడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

నరుబుజ్జిలి: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల గడువును ఈ నెల 27 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ బేతన సామి బుధవారం తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అపురూప ప్రస్థానం

శ్రీకాకుళం కల్చరల్: 75 ఏళ్ల ప్రస్థానంలో శ్రీకాకుళం జిల్లా ఎన్నో అపురూప ఘట్టాలకు సాక్షిగా నిలిచింది. 75 ఏళ్లకు ముందు కూడా సిక్కోలు చరిత ఘనంగా సాగింది. ఆ అపూర్వ ఘట్టాల సమాహారాన్ని పరిశీలిస్తే..

- 1950లో శ్రీకాకుళం జిల్లాగా ఏర్పడింది.
- మన జిల్లా రాజుల పాలన నుంచి ఈస్టిండియా కంపెనీ, బ్రిటీష్ పాలనను చూసింది.
- 11 తాలూకాలతో 1950లో ఆవిర్భవించిన శ్రీకాకుళం జిల్లా ఆంధ్రప్రదేశ్‌కు ఉత్తర కోస్తా తూర్పుతీరంలో ఉంది.
- 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1948 నాటికే జిల్లా ఏర్పాటుకు ఈ ప్రాంత వాసులు కృషి చేశారు.
- చివరకు 1950 ఆగస్టు 15కు జిల్లా ఏర్పాటైంది.
- అప్పటి జిల్లా కలెక్టర్‌గా 'మిస్టర్ వైట్' ఉండగా జిల్లా ఏర్పడిన వెంటనే కలెక్టర్‌గా జనాబ్ షేక్ అహ్మద్ తొలి కలెక్టర్‌గా నియమితులయ్యారు.

జిల్లా బోర్డు చైర్మన్‌గా రొక్కం

1951 జనవరి 31న జిల్లా బోర్డు అధ్యక్షుని ఎన్నిక విశాఖ బోర్డు భవనంలో జరిగింది. రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ వ్యవహరించారు. తొలి అధ్యక్షునిగా రొక్కం లక్ష్మీనరసింహదొర ఎన్నికయ్యారు. 1959 డిసెంబరు ఒకటిన అధికారికంగా ఏర్పాటైన బోర్డుకు బెండి కూర్మన్న అధ్యక్షునిగానూ, కొత్తపల్లి పున్నయ్య ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

మున్సిపాలిటీగా..



రాష్ట్రంలో ఆవిర్భవించిన తొలి మున్సిపాలిటీల్లో ఒకటిగా శ్రీకాకుళానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. విశాఖకంటే ముందుగా ఏర్పడిన మున్సిపాలిటీ ఇది. 1856లో పట్టణశాఖ చట్టం ద్వారా చికాకోల్ మున్సిపాలిటీగా ఏర్పడి, శ్రీకాకుళంగా రూపొందింది. అప్పుడు కేవలం 8 వార్డులుగా గ్రేడ్–3 మున్సిపాలిటీగా ఏర్పడినప్పటికీ 1965లో ప్రథమ శ్రేణి మున్సిపాలిటీగా ఎదిగింది. 2015 డిసెంబర్ 9న కార్పొరేషన్‌గా మారింది. ఇప్పుడు 50 డివిజన్లు ఉన్నాయి.

విద్యుత్ సౌకర్యం

శ్రీకాకుళం మున్సిపాలిటీకి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు 1939లో చికాకోల్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి జనరేటర్ సహాయంతో 139 విద్యుత్ స్తంభాలకు విద్యుద్దీకరణ చేశారు. ప్రస్తుతం సెంటర్ లైటింగ్ టౌన్‌గా మారింది.

ప్రముఖుల సందర్శన

జిల్లా కేంద్రానికి 1927లో గాంధీజీ వచ్చారు. ఆయనకు అప్పటి మున్సిపల్ చైర్మన్ చట్టి పూర్ణయ్యపంతులు నేతృత్వంలో సన్మానం చేశారు. 1935లో బాబూ రాజేంద్రప్రసాద్, 1936లో జవహర్‌లాల్ నెహ్రూ విచ్చేశారు.

తొలి మున్సిపల్ ఎన్నికలు

శ్రీకాకుళం మున్సిపాలిటీగా 1856లో ఏర్పడిన తర్వాత 1905లో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. తొలి చైర్మన్‌గా టి.వి. శివరావు ఎన్నికయ్యారు.

నేడు జిల్లా స్థాయి పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: వజ్రోత్సవాల సందర్భంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు బుధవారంతో ముగిశాయి. గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి జిల్లాస్థాయి పోటీలు ప్రారంభమవుతాయని ఆర్ఐఓ తెలిపారు. అదేవిధంగా ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో కర్రసాము, సంగిడి వంటి గ్రామీణ క్రీడాపోటీలు కూడా జరగనున్నాయి.

వజ్రోత్సవ విజేత వెదర్‌మ్యాన్ అరవింద్

శ్రీకాకుళం కల్చరల్: వజ్రోత్సవాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియోగ్రఫీ పోటీల విజేతలను జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ బుధవారం ప్రకటించారు. శ్రీకాకుళం వెదర్‌మ్యాన్ అరవింద్ ప్రథమ, హలో చిక్కోలు ప్రశాంత్ ద్వితీయ, ప్రణవ్ తృతీయ స్థానాలు సాధించారు. వీరితో పాటు ఎంతో మంది యువత సృజనాత్మకతతో కూడిన వీడియోలను రూపొందించారని జేసీ ప్రశంసించారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపికకు కసరత్తు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏటా స్వాతంత్ర్య వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది 200 అంతకంటే తక్కువ మందిని ఎంపిక చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు నిర్ణయించారు. ఈ మేరకు ఉత్తమ ఉద్యోగుల జాబితాలు కలెక్టరేట్‌కు చేరాయి. వీటిపై జాయింట్ కలెక్టర్ స్క్రీనింగ్ చేస్తున్నారు. కొందరు ఉద్యోగులను పిలిపించి ఇటీవల అందించిన సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన వాక్‌థాన్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు



మన శ్రీకాకుళం.. మన వజ్ర సంకల్పం

ఉత్సాహంగా మొదలైన జిల్లా ఆవిర్భావ వేడుకలు

- 75 ఏళ్ల ఉత్సవంలో అందరూ భాగస్వాములు కావాలి
- వాక్‌థాన్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఒక జిల్లా చరిత్రలో 75 ఏళ్ల ప్రస్థానం ఒక ల్యాండ్ మార్క్‌గా నిలిచిపోతుంది. శ్రీకాకుళం జిల్లా అటువంటి ప్రత్యేక సందర్భాన్ని ఇప్పుడు ఆస్వాదిస్తోంది. సంబరం చేసుకుంటోంది. ఇది కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాల్సిన సందర్భమే. అయితే సంబరాలతో పాటు బలమైన సంకల్పం తీసుకోవాల్సిన సందర్భం కూడా ఇదే. వజ్ర సంకల్పం పూనడం ద్వారా గతానికి, భవిష్యత్తుకు మధ్య వారధి వేస్తూ జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామని జిల్లావాసులందరూ వజ్ర సంకల్పం పూనాలి. – శ్రీకాకుళం కల్చరల్

ఉత్సాహ తరన్‌గం

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు వాక్ థాన్ పేరిట చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వర్గాల వారు ముఖ్యంగా విద్యార్థులు, యువత జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం వరకు జరిగే ఉత్సవాలు, సాంస్కృతిక ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 75 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని సగర్వంగా జరుపుకొందామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ ఎగ్జిబిషన్


ఆమదాలవలస నియోజకవర్గ స్టాల్


నరసన్నపేట నియోజకవర్గ స్టాల్

జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఎనిమిది నియోజకవర్గాల్లో నెలకొన్న ప్రత్యేకతలతో కూడిన స్టాల్స్(ఎగ్జిబిషన్)ను బుధవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ప్రారంభించారు. స్వాతంత్ర్యకాలం నాటి గుర్తులు, స్థానికంగా లభించే తినుబండారాలు, ఆ ప్రాంత స్వాతంత్ర్య సమరయోధులు, కళాకారులు, సాహిత్యకారులు, చారిత్రక భవనాలు, కళాఖండాలు, చేనేత ఉత్పత్తులు, కనువిందు చేశాయి. కాగా ఎగ్జిబిషన్ ప్రారంభం సమయానికి టెక్కలి నియోజకవర్గానికి సంబంధించిన స్టాల్ రెడీ కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డీఐసీ జనరల్ మేనేజర్ జి.ఎం.శ్రీధర్, ఇంటాక్ అదనపు కన్వీనర్ వి.జగన్నాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం


రక్తదానం చేస్తున్న యువత

జిల్లా ఏర్పడి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రారంభించారు. 80 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీరాములు ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పి.చైతన్యకుమార్, కళాశాల సిబ్బంది, పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సహకారం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ భరోసా ఇచ్చారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం ఇండస్ట్రియల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనేక వనరులు ఉన్నాయని, వాటి ద్వారా ఉత్పత్తులు తయారు చేసి వ్యాపారం చేసుకునేందుకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. త్వరలో బీచ్ కారిడార్ ప్రారంభం కాబోతోందని, మూలపేట వద్ద పోర్టు దాదాపు పూర్తయ్యిందని, భోగాపురం ఎయిర్‌పోర్టుతో పరిశ్రమలు మరింతగా అభివృద్ధి కానున్నాయని వివరించారు. అనంతరం పలువురు ఇన్వెస్టర్లు స్థలం, విద్యుత్, కార్మికుల సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, డీఆర్‌వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర శ్రీకాకుళం

తలవంచని ఉద్యమ బావుటా!

సిక్కోలు కొండల్లో నినాదాలు ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఆ తోటల మాటున విప్లవాగ్నులు రగులుతూనే ఉంటాయి. పోరాటం ఈ నేల స్వభావం. ఉద్యమం ఈ మట్టి గుణం. అణచివేత ఆనవాలు కనబడిన ప్రతిసారీ సిక్కోలు నిప్పు కణికై రగిలింది. మెడలు వంచి హక్కులు సాధించుకోవచ్చని చాలాసార్లు రుజువు చేసి చూపించింది. 75 ఏళ్ల శ్రీకాకుళం చరిత్రలో ఉద్యమాల పుటలు తెరిచి చూస్తే అక్షరాలు అగ్ని కణాలై కనిపిస్తాయి. ఆ ఆనవాళ్లు గమనిస్తే.. – పలాస




సీతంపేటలోని ఐటీడీఏ కార్యాలయం

- పోరాటాల వల్ల జిల్లాకు అందిన ఫలితాలెన్నో
- గిరిజన, మైదాన ప్రాంతాల్లో ఏళ్ల తరబడి మార్మోగిన విప్లవ నినాదాలు

శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం సిక్కోలు చరితలో ఓ కలికితురాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ నాటి కమ్యూనిస్టు నాయకులు, దేశభక్తులు ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో పాటు దున్నే వానికి భూమి లభిస్తుందని, ఫలితంగా ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయని ఆశించారు. కానీ అనతి కాలంలోనే వారి ఆశలు ఆవిరయ్యాయి. దీంతో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రైతు కూలీ సంఘాలు ఏర్పడ్డాయి. 1940 ఏప్రిల్‌లో మందస జమిందారు వ్యతిరేక పోరాట అనుభవాలతో టెక్కలి డివిజన్‌లో మార్పు పద్మనాభం, గానుగుల తరుణాచారి, గంటి రాజేశ్వరరావు, గవరయ్య తదితరుల నాయకత్వాన రైతు కూలీ సంఘాల నిర్మాణం జరిగింది. అలాగే పాలకొండ, పార్వతీపురం గిరిజన గ్రామాల్లో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, ఆరిక సోములు తదితరుల నాయకత్వాన రైతు కూలీ సంఘాలతో పాటు గిరిజన సంఘాల నిర్మాణాలు ఊపందుకున్నాయి. 1959 వరకు ప్రజాసంఘాల నిర్మాణాలు చేసి భూస్వాముల, గ్రామాల్లో పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలను చట్ట పరంగా చేపట్టారు. కానీ వీరిపై దాడులు పెరగడంతో ప్రతిఘటనలు పుట్టి తిరుగుబాటు మొదలైంది. ఈ నేపథ్యంలోనే 1967లో నక్సల్బరిలో చారూమజుందార్ నాయకత్వాన అక్కడ భూస్వాములతో పోరాటాలు చేశారు. ఆ పోరాటంలో 9 మంది గిరిజన సంఘ నాయకులు ఇతరులు మృతి చెందారు.


ఉద్దానం ప్రాంతంలోని మల్రిపాడు వద్ద అమరవీరుల స్మారక స్థూపం

1969లో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం

ఆ పరిస్థితుల్లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం అధికారంలో ఉంది. కమ్యూనిస్టు పార్టీ వల్ల కూడా ఉపయోగం లేదని, ఆ పార్టీ నుంచి చారుమజుందార్‌తో పాటు చాలా మంది నాయకులు బయటకు వచ్చి సి.పి.ఐ.ఎం.ఎల్ పార్టీని స్థాపించారు. ఈ పార్టీ నిర్మాణం 1968లో జరగగా శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం 1969 నవంబరు 25లో ప్రారంభించారు. అప్పటికే ఉద్దానం ప్రాంతంలో విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ గణపతి, పంచాది కృష్ణమూర్తి, పైలా వాసుదేవరావు తదితరుల నాయకత్వాన వర్గశత్రు నిర్మూలన చేయాలని నిర్ణయాలు జరిగాయి. అప్పటి జిల్లా నాయకులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ఆధ్వర్యంలో కూడా నిర్ణయాలు చేశారు. దీనికి సమాయత్తం అవుతుండగానే ఉద్దానం ప్రాంతం గరుడ భద్రలో పంచాది నిర్మల నాయకత్వాన మహిళా సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కూలి రేట్లు పెంచాలని డిమాండ్ ఊరేగింపును 1969 నవంబరు 24న నిర్వహించగా ఆ గ్రామ భూస్వామి మహిళలపై రౌడీలతో దాడి చేయించారు. ఈ విషయం తెలిసిన సుబ్బారావు పాణిగ్రాహి మరికొంత మంది యువకులు ఆ గ్రామానికి వెళ్లగా రౌడీల దాడిలో పాణిగ్రాహి తలకు దెబ్బ తగిలింది. దీంతో రెచ్చిపోయిన పార్టీ కార్యకర్తలు, మహిళలు భూస్వామి వరి పంటను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఉద్దానం గ్రామాల మీద పోలీసు దాడులు ప్రారంభమయ్యాయి. ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు ఆ రోజు నుంచే అజ్ఞాతంలోకి వెళ్లిపోయి సాయుధ దళాలుగా ఏర్పడ్డారు. పాలకొండ, పార్వతీపురం, ఉద్దానం ప్రాంతాల్లో గిరిజన ప్రాంతాల్లో ఈ సాయుధ దళాలు భూస్వాముల ఇళ్లపై దాడులు చేసి, వర్గశత్రు నిర్మూలన పేరిట భూస్వాములను హత్యలు చేశాయి. దీంతో పోలీసు నిర్బంధం బాగా పెరిగింది. దీంతో జిల్లా యుద్ధ వాతావరణం నెలకొంది. ఆ విధంగా ఆ పోరాటంలో ఒక ఏడాదిలోనే 360 మందికి పైగా పోలీసు కాల్పుల్లో మృతి చెందారు.

అసువులు బాసిన వీరులెందరో..

మొదటిగా కంచిలి రైల్వే స్టేషన్ వంచాది కృష్ణమూర్తి పాటు ఆరుగురిని పట్టుకొని కాల్చి చంపారు. చివరిగా 1970 జూలైలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంలు పోలీసు కాల్పుల్లో మృతి చెందారు. ఈ విధంగా ఈ ఉద్యమంలో ఎంతో మంది నాయ కులు, కార్యకర్తలు తమ ప్రాణాలను కోల్పోయారు. అక్కడక్కడా ఉండి మిగిలిన కార్యకర్తలు చెల్లా చెదురయ్యారు. కొంత మంది జైళ్లకు వెళ్లారు.ఉద్యమం స్తబ్ధతకు గురైనప్పటికీ ప్రజలకు వాటి ఫలితాలు అందాయి.

ఉద్యమ ఫలితాలు

- జిల్లాలో జరిగిన ఉద్యమాల్లో భూస్వాములు ఆ ప్రాంతాలను వదిలి పట్టణాల బాటపట్టారు. వారి నుంచి సుమారు 20 వేల ఎకరాలను పంట భూములను స్వాధీనం చేసుకొని గిరిజనులకు పంచిపెట్టారు.
- భూమి సమస్యను ప్రభుత్వం గుర్తించింది. పోడుభూములకు పట్టాలను ఇచ్చారు. 1976లో సీతంపేటలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ(ఐ.టి.డి.ఎ) ఏర్పాటు చేశారు. 1/70 చట్టాన్ని అమల్లోకి తెచ్చారు.
- ఫలితంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న భూములను గిరిజనేతరులకు అమ్మకాలు, కొనుగోలు నిషేధమైంది.
- గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఏర్పడ్డాయి. గిరిజన కార్పొరేషన్లు పెట్టారు.
- భూస్వాముల వద్ద పాలేర్లుగా ఉండి వెట్టిచాకిరీకి గురైన వారికి ఊరట కలిగింది.

ఎందరో మహానుభావులు..

- జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించిన సిక్కోలు ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: స్వాతంత్ర్య పోరాటంలో మన జిల్లా నుంచి ఎంతో మంది పాల్గొన్నారు. వివిధ ఉద్యమాల్లో పాల్గొని స్వాతంత్ర్యం రాకలో భాగస్వాములయ్యారు. వారిలో కొందరు ప్రముఖంగా నిలిచారు. వారిలో గరిమెళ్ల సత్యనారాయణ, గౌతు లచ్చన్న, చౌదరి సత్యనారాయణ, మార్పు పద్మనాభం, వీరగున్నమ్మ, స్వామిబాబు పాట్నూరు తదితరులు ఉన్నారు. వారి గురించి ఒక్కసారిగా స్మరించుకోవల్సిన అవసరం ఉంది.

చౌదరి సత్యనారాయణ



ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురానికి చెందిన చౌదరి సత్యనారాయణ 1921లో అప్పటి జాతీయ కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ పిలుపు మేరకు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 13వ ఏటనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న చౌదరి సత్యనారాయణ పోలీసుల లాఠీ దెబ్బలకు తీవ్ర గాయాల పాలై కోలుకోవడానికి 6 నెలల సమయం పట్టింది. సత్యాగ్రహం చేసిన సత్యనారాయణను బ్రిటీష్ పోలీసులు అరెస్టు చేయగా 6 నెలలు జైలు శిక్ష అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ ప్రచార కార్యక్రమం సందర్భంగా వచ్చిన గాంధీని దూసి రైల్వే స్టేషన్‌లో కలిసి పొందూరు ఖద్దరు పంచెను బహుకరించారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా అరెస్టై జైలు శిక్ష అనుభవించారు.

గరిమెళ్ల సత్యనారాయణ



స్వాతంత్రోద్యమ కవుల్లో గరిమెళ్ల సత్యనారాయణది విశిష్ట స్థానం ఉంది. గరిమెళ్ల గేయాలు పాఠక జనాన్ని ఉర్రూతలూగించాయి. అతను రాసిన మాకొద్దీ తెల్ల దొరతనం పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువ, ఉత్తేజాన్ని కలిగించింది. దండాలు దండాలు భారత మాత అనే గీతం కూడా ప్రజలను జాగృతం చేసింది.

గౌతు లచ్చన్న



సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న. వి.వి.గిరి, నేతాజీ, జయంతి ధర్మతేజ తదితర జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు కెళ్లారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం జరిగిన సమయంలో లచ్చన్న ఇక్కడ ఉద్యమాన్ని నడిపారు. ఆ తర్వాత జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గొని జైలు కెళ్లారు.

మార్పు పద్మనాభం



మందస మండలంలోని భిన్నళ మదనాపురం గ్రామంలో జన్మించిన మార్పు పద్మనాభం 1930లో గాంధీజీ పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. తర్వాత జరిగిన ఉద్యమాల్లో కూడా పాల్గొన్నారు. పలు పర్యాయాలు జైలుకెళ్లారు. మందస కాల్పుల ఘటన తర్వాత ఆయనను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సర్దార్ బిరుదు ఇచ్చి సత్కరించింది. 1944లో జైలు నిర్బంధం నుంచి బయటికొచ్చిన తర్వాత ఉత్తరాంధ్రలో అరుణ పతాక ఆశయాలను ప్రచారం చేసి కట్టుబడిన తొలితరం కమ్యూనిస్టుగా చరిత్రలో నిలిచారు.

వీరగున్నమ్మ



బ్రిటీష్ ముష్కరుల చర్యలను ఎదిరించిన సామాన్య మహిళగా వీరగున్నమ్మ నిలిచారు. ఆంగ్లేయులతో పోరాటానికి సై అన్న ధీశాలి. రైతులు పండించే పంటలో మూడో భాగాన్ని కప్పం కింద ఆంగ్లేయులు వసూలు చేయడం, అటవీ ఉత్పత్తులను తెచ్చుకునేందుకు బ్రిటీష్ పోలీసులు అడ్డుకున్న సమయంలో రైతులకు, పోలీసుల మధ్య జరిగిన పోరాటంలో పోలీసుల తుపాకీ కాల్పుల తూటాలకు గురై మృతి చెందారు.

స్వామిబాబు పాట్నూరు



నరసన్నపేటకు చెందిన పాట్నూరు స్వామి దేశ భక్తుడిగా, దాతగా, సంఘ సేవకుడిగా, కవిగా తనదైన ముద్ర వేసుకున్నారు. వందేమాతరం ఉద్యమంలో కుటుంబంతో కలిసి పాల్గొన్నారు. స్వరాజ్య ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.

కొత్తపల్లి పున్నయ్య



సోంపేట మండలం బారువలో జన్మించిన కొత్తపల్లి పున్నయ్య క్విట్ ఇండియా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. భారత ప్రభుత్వం రాజ్యాంగ సమీక్షా సంఘంలో పున్నయ్యను సభ్యుడిగా నియమించారు.

క్లుప్తంగా

జోడూరు కొండపై పురాతన విగ్రహాలు



జోడూరులో బయటపడిన విగ్రహాలు

మెళియాపుట్టి: జోడూరు గ్రామ పరిధిలోని కొండపై బుధవారం పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. గ్రామానికి చెందిన రాయలహర్ష అనే 7వ తరగతి విద్యార్థి చెప్పిన సమాచారం మేరకు గ్రామస్తులు వెళ్లి పరిశీలించగా రెండు రాతి విగ్రహాలు గుర్తించారు. అయితే ఆ విద్యార్థి తనకు కలలో సంతోషిమాత ఈ విషయం చెప్పిందని పేర్కొనడం గమనార్హం.

పాఠశాలకు కుళ్లిన కోడిగుడ్లు



పాఠశాలకు సరఫరా చేసిన కుళ్లిన కోడిగుడ్లు

పొందూరు: మండలంలోని కోటిపల్లి ప్రాథమిక పాఠశాలకు సరఫరా చేసిన కోడిగుడ్లు పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. క్వాలిటీ గుడ్లు కాకుండా నాణ్యత లేని గుడ్లు అందించడంతో కుళ్లిపోతున్నాయని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. గుడ్లు కుళ్లిపోయిన విషయాన్ని మండల విద్యాశాఖాధికారులకు తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

సరుబుజ్జిలి: మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ బి.బేతన సామి బుధవారం ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి చదివిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జనావాసాల్లోకి ఎలుగు పిల్లలు



గోతిలో పడిపోయిన ఎలుగుబంటి పిల్లలు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట గ్రామానికి ఆనుకుని బుధవారం రెండు ఎలుగు బంటి పిల్లలు దారి తప్పి గ్రామ సమీపంలోని గోతుల్లో పడ్డాయి. ఇది గమనించిన స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ, అగ్నిమాపక శాఖాధికారులు గ్రామానికి చేరుకుని గోతుల్లో పడిన ఎలుగు బంటి పిల్లలను చాకచక్యంగా బయటకు తీసి సమీపంలోని కొండ ప్రాంతాల్లో విడిచిపెట్టారు. అయితే ఎలుగు బంటి పిల్లలు గ్రామ సమీపంలోకి చేరుకోవడంతో గ్రామస్తులంతా ఒక్కసారిగా భయాందోళన చెందారు.

మందుల్లేవ్..!



- పశు ఆరోగ్య సంచార వాహనాల్లో వింత పరిస్థితి
- మందులు లేకుండానే పల్లెలకు వెళ్తున్న వాహనాలు
- పాడి రైతులకు తప్పని అవస్థలు



పాతపట్నం సంచార పశు ఆరోగ్య సేవ వాహనం

పాతపట్నం:

పాడి రైతులు ఫోన్ చేసిన వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి వైద్యసేవలందించాల్సిన పశు ఆరోగ్య సంచార వాహనాలు రోజురోజుకూ నిర్వీర్యమైపోతున్నాయి. పశువుల చికిత్సకు మందులు లేకుండానే గ్రామాలకు వెళ్తున్నాయి. దీంతో పాడి రైతులు ప్రైవేటున మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశువుల వైద్యానికి సత్వర సేవలు అందించేందుకు సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది. నియోజవర్గానికి రెండు వాహనాలు ఉంచారు. రెండు మండలాలకు ఒక వాహనం చొప్పున వైద్య సేవలు అందించేవి. శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తే దగ్గరలోని ప్రాంతీయ పశు వైద్యశాలలకు తరలించి, అక్కడ చికిత్స అందించి అనంతరం గ్రామానికి పంపించేవారు. శ్రీకాకుళం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు రెండు చొప్పున సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు 16 ఉన్నాయి.

ప్రైవేటుగా మందుల కొనుగోలు

మూగ జీవాల చికిత్స కోసం వచ్చిన సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల్లో మందులు లేకపోవడంతో పాడి రైతులు పశు వైద్యుడు చెప్పిన మందులు ప్రైవేటు మందుల దుకాణంలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. దీంతో రైతులకు చేతి చమురు వదులుతోంది. సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను గతంలో జీవీకే సంస్థ నిర్వహించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవ్య హెల్త్ ప్రొవైడర్స్ సంస్థకు అప్పగించింది.

జిల్లాలో పశువుల సంఖ్య

ఆవులు	4,56,291
గేదెలు	40,477
గొర్రెలు	6,23,641
మేకలు	2,77,268
కోళ్లు	13,19,100

గతానికి భిన్నంగా...

సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను గతానికి భిన్నంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనంలో ఒక పశు వైద్యుడు, వెటర్నరీ డిప్లమో చేసిన సహాయకుడు, డ్రైవర్ కం అటెండర్ మొత్తం ముగ్గురు సిబ్బంది ఉంటారు. గతంలో నెలకు 8 వేల నుంచి 9 వేల కిలోమీటర్ల వరకు ఒక్కో వాహనం సేవలు అందించేవి. ఇప్పుడు వాహనాలు నెలకు 3 వేల కిలోమీటర్లు కూడా తిరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా రోజుకు రెండు మూడు గ్రామాల్లో వాహనం పెట్టి సేవలు అందిస్తున్నారు. అలాగు కొన్ని గ్రామాలకు వాహనాలు వెళ్లడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

సొంతంగానే మందులు



మా ఆవులకు అనారోగ్య సమస్యలు వచ్చాయి. ఫోన్ చేయగానే సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలో వచ్చారు. వైద్యులు ఆవులకు వైద్యం చేసి మందులు రాశారు. వాహనంలో మందులు లేవని చెప్పారు. ఆ మందులను పాతపట్నం వెళ్లి బయట కొన్నాం.

– మహంతి జీవీశ్వరరావు, ప్రహరాజపాలేం, పాతపట్నం మండలం

మందులు వచ్చాయి



సంచార పశువైద్యశాలల్లో మందుల కొరత ఉంది. ఇదివరకే ఇండెంట్ పెట్టాం. అయితే ప్రస్తుతం మందులు వచ్చాయి. వాటిని సంచార పశు వైద్యశాలలకు అందిస్తాం. ఇకపై పాడి రైతులకు ఇబ్బంది ఉండదు.

– డాక్టర్ ఎం.కరుణాకరరావు, సహాయ సంచాలకుడు, ప్రాంతీయ పశువైద్యశాల, పాతపట్నం

గురుకులాల్లో వసతులు పెంచాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు దళిత సంఘాల జేఏసీ వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గురుకులాల్లో వసతులు కల్పించాలని దళిత సంఘాల జేఏసీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల జేసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, మాల మహానాడు జిల్లా నాయకుడు బైరి ధనరాజ్, రెల్లి కుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అర్జీ కోటి, అర్జి ఈశ్వరరావు, అంబేడ్కర్ యూనివర్సిటీ చైర్ సాధన సమితి జిల్లా కన్వీనర్ టి.రమణ మాట్లాడుతూ... అంబేడ్కర్ గురుకుల ప్రవేశాల్లో ఈ ఏడాది ప్రత్యేక దృష్టి సారించకపోవడం, విధానాలు సరిగా లేకపోవడంతో చేరిన విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఇంత పెద్ద మొత్తంలో రాష్ట్రవ్యాప్తంగా సీట్లు భర్తీ కాకుండా ఉండిపోవడం ఇదే మొదటిసారి అని, ఈ విషయంపై మంత్రి లోకేష్ దృష్టి సారించాలని కోరారు. జిల్లాలో సుమారు 1,300 సీట్లు భర్తీ కాకుండా ఉండడం అంటే పర్యవేక్షణ అధికారి లోపమే కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నందిగాం, పాతపట్నం, మందస, ఎచ్చెర్ల గురుకులాల్లో పనిచేస్తున్నారని వారిని వెంటనే వేరేచోటుకి బదిలీ చేయాలని కోరారు. గురుకులాల్లో సమూలంగా మార్పులు తీసుకురావాలని, ఈ విషయమై దళిత సంఘాల ఆధ్వర్యంలో దశలు వారీగా ఆందోళనకు పిలుపు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

గంజాయితో నలుగురు అరెస్టు

నరసన్నపేట:

జాతీయ రహదారిపై మండలంలోని మడపాం టోల్‌గేట్, సత్యవరం ఫ్లైఓవరు వంతెన కూడలి వద్ద నరసన్నపేట పోలీసులు నిర్వహించిన సోదాల్లో 21 కేజీల గంజాయిని సీజ్‌చేసి, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు తెలిపారు. స్థానిక సర్కిల్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసన్నపేటలోని సూరజ్ నగర్‌లో గంజాయి సేవిస్తూ నరసన్నపేటకు చెందిన సూర కీర్తన్(మణి), గరక మోహన్‌లు పట్టుబడ్డారన్నారు. వీరు ఇచ్చిన సమాచారంతో సత్యవరం ఫ్లైఓవరు వంతెన వద్ద తనిఖీలు చేస్తుండగా పర్లాకిమిడికి చెందిన సంజు అనే వ్యక్తి పట్టుబడ్డాడని, అతడి వద్ద నుంచి 21.750 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే సంజు స్నేహితుడు తేజను కూడా గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలతో సంబంధం ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశామని వెల్లడించారు. నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించారని అభినందించారు. సమావేశంలో సీఐ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మణరావు

సిక్కోలు టీడీపీలో 'కుల'కలం!

- కళింగ కోమటి చైర్మన్ పదవికి కాళింగ సామాజిక వర్గీయుడి పేరు
- అధిష్టానానికి అవగాహన లేదంటూ విమర్శలు

శ్రీకాకుళం : జిల్లాతో పాటు నగర కళింగ కోమట్లు తెలుగుదేశం పార్టీ అధినాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్ పదవులకు చైర్మన్‌ల పేర్లను ప్రకటించారు. అందులో కళింగ కోమటి సంఘ చైర్మన్‌గా కాళింగ కులానికి చెందిన మొదలవలస రమేష్ పేరు ప్రకటించడంపై కోమట్లు రగిలిపోతున్నారు. ఇదే విషయాన్ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ల దృష్టికి తీసుకువెళ్లగా ఏదో పొరపాటు జరిగి ఉంటుందని తేలిగ్గా తీసుకోవడాన్ని తప్పుపడుతున్నారు. నాయకుల్లో ఎవరు ఏ కులానికి చెందిన వారో తెలియని స్థాయిలో రాష్ట్ర నాయకత్వంతో పాటు సీఎంఓ కార్యాలయం, పార్టీ కార్యాలయాల్లో ఉన్నారని వారంతా మండిపడుతున్నారు. జాబితాలో 'కాళింగ కోమటి/కాళింగ వైశ్య' అని తప్పుగా ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అరకొర పదవులు

శ్రీకాకుళం నియోజకవర్గ కేడర్‌కు అరకొరగా పదవులు లభించడాన్ని కూడా స్థానిక నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాలకు రెండు నుంచి మూడు పదవులు లభించగా శ్రీకాకుళం నియోజకవర్గంలో ఒక పదవి మాత్రమే రావడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అది కూడా రూరల్ మండలానికి చెందిన నాయకుడికి అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఇవ్వడాన్ని ఆక్షేపిస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గ నాయకులకు సైతం రాష్ట్రస్థాయి పదవులు రాగా శ్రీకాకుళం నియోజకవర్గానికి ఒక్క పదవి కూడా లేకపోయినా శాసనసభ్యుడు మౌన వహించడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనికితోడు శ్రీకాకుళం నగరంలో ఒకే ఇంట్లో రెండు పదవులు ఇవ్వాలని శాసనసభ్యుడు నిర్ణయం తీసుకోవాలని యోచించడం పట్ల క్యాడర్ ఆగ్రహంతో ఉన్నారు. శ్రీకాకుళం నగర పార్టీ అధ్యక్షుడి పేరును ప్రకటించకపోయినప్పటికీ పాండ్రంకి శంకర్‌కు ఇవ్వాలని దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఆయన సోదరుడు పాండ్రంకి దేవేందర్‌నాయుడుకు ఇప్పటికే ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయం చైర్మన్‌గా ఎంపిక చేయడంపై క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రైతన్నా.. జాగ్రత్త..!



- మార్కెట్‌లో నకిలీ ఎరువులు
- కొనుగోలు సమయంలో అవగాహన అవసరం
- మందులకు రశీదు తప్పనిసరి

హిరమండలం:

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈ తరుణంలో పంట పొలాల్లో రైతులు అధికంగా ఎరువులు వినియోగిస్తారు. అయితే మార్కెట్‌లోకి నకిలీ ఎరువులు, పురుగు మందులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువులు కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధికారుల సూచన మేరకు ఎరువులు, పురుగు మందులు తీసుకోవాలని, లేకుంటే నిలువునా మోసపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

దళారుల వద్ద కొనుగోలు చేయవద్దు

నిషేధిత పురుగుల మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోతారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎరువుల వ్యాపారులు పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి అనుమతిలేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా అనుమతిలేని దుకాణాలు, దళారుల వద్ద కనుగోలు చేయవద్దని సూచిస్తున్నారు. వాటిని కొనుగోలు చేస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటుందని అంటున్నారు. మందుల లేబుల్స్ మొదట పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అనే విషయాలు రైతులు తెలుసుకోవాలని సూచిస్తున్నారు. మందులు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలంటున్నారు.

నకిలీలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు మా పరిశీలనలో గుర్తిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్, దుకాణ యజమాని సంతకాలతో కూడిన బిల్లులను అందజేయాలి. క్రిమి సంహారక మందులను కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. సంబంధిత ఎరువులు ఏ కంపెనీవో నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన వివరాల ప్రకారమే మందులు పిచికారీ చేయాలి.

– బి.సంధ్య, మండల వ్యవసాయాధికారి, హిరమండలం

ఫిర్యాదు చేయండి

దుకాణాల వద్ద లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్ ఆధారంగా తయారు చేసిన తేదీని గుర్తించడంతో పాటు ఏ కంపెనీ.. ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణ యజమాని, డీలర్ సంతకాలతో కూడిన బిల్లులను తప్పక తీసుకోవాలని, ముఖ్యంగా విత్తనాలకు సంబంధించిన సంచులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నకిలీపై సత్వరం రైతులు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం జరగడానికి అవకాశం ముందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

బంగారం పేరుతో బురిడీ

- నగం ధరకే ఇప్పిస్తామంటూ రూ.12 లక్షలతో ఉడాయించిన కేటుగాళ్లు
- లబోదిబోమంటున్న బాధితురాలు

పార్వతీపురం రూరల్: సగం ధరకే పావుకిలో బంగారం ఇప్పిస్తామంటూ నమ్మించి ఓ మహిళ వద్ద రూ.12 లక్షలతో దుండగులు పరారైన ఘటన పార్వతీపురం పట్టణ శివారులో చోటుచేసుకుంది. బాధిత మహిళ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ప్రాంతానికి చెందిన శ్రీలక్ష్మిని తన వద్ద గతంలో విద్యనభ్యసించిన విద్యార్థిని భర్త రిషి అనే వ్యక్తి గతనెల జూలైలో కలిశారు. సగం ధరకే బంగారం ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. పావుకిలో బంగారాన్ని రూ.12 లక్షలకు ఇప్పిస్తామని, డబ్బులు సిద్ధం చేసుకోవాలని చెప్పాడు. ఆ మేరకు ఆమె ఈ నెల 11న డబ్బులు సిద్ధం చేశారు. ఆయన సూచన మేరకు బంగారం విక్రయించే వారి వద్దకు వెళ్లేందుకు బుధవారం పాలకొండకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. బంగారం విక్రయిస్తామని చెప్పిన ఇద్దరు వ్యక్తులతో మాట్లాడారు. బంగారాన్ని బహిరంగంగా చూపించడం కుదరదంటూ పార్వతీపురం శివారులో ఉన్న వాటర్‌పంప్ హౌస్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మాట్లాడుతున్న సమయంలో మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి శ్రీలక్ష్మి ముఖంపై మత్తు పౌడర్ చల్లారు. ఆమె అపస్మారక స్థితిలోకి చేరాక రూ.12 లక్షలతో ఉడాయించారు. తనతో పాటు వచ్చిన రిషి అనే వ్యక్తి కూడా కనిపించకపోవడంతో పార్వతీపురం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిషి అనే వ్యక్తిని విచారణ చేసి కేసు నమోదు చేశామని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి తెలిపారు.



ఘటనా స్థలాన్ని చూపిస్తున్న బాధిత మహిళ శ్రీలక్ష్మి

ఇద్దరు మహిళా దొంగలు అరెస్టు

సోంపేట: మండలంలోని బారువ పోలీస్‌స్టేషన్ పరిధి కొర్లాం పంచాయతీ కొర్లాం గ్రామంలో గత నెల 28వ తేదీన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ బి.మంగరాజు తెలిపారు. బారువ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కొర్లాం గ్రామానికి చెందిన తూగా బాలమ్మ, గార వాణిల తాళం వేసిన ఇళ్లలోకి ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళలు మొంకి సింగ్, సొయిదా సింగ్ తాళాలు తీసి ప్రవేశించారన్నారు. వీరు రెండు ఇళ్లలో ఉన్న సుమారు 34 గ్రాములు బంగారం, 58 గ్రాముల వెండి, దాదాపు రూ.24 వేల నగదు చోరీ చేశారని వెల్లడించారు. దొంగతనం జరిగిన రోజు సీసీ కెమెరాల్లో అనుమానితులను పరిశీలించామన్నారు. అనంతరం బుధవారం పాలవలస రైల్వేగేటు వద్ద అనుమానితులుగా గుర్తించిన వీరిద్దరూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించడంతో అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వీరిని విచారించగా కొర్లాం గ్రామంలో చేసిన దొంగతనం నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి చోరీ చేసిన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో బారువ ఎస్ఐ హరిబాబునాయుడు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వడ్డీ వ్యాపారి అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో గత కొంతకాలంగా వడ్డీలకు డబ్బులిచ్చే వ్యాపారి, తిరిగి కొందరు వ్యక్తులకు బకాయి పడి ఆర్థిక ఇబ్బందులు భరించలేక అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు వెల్లడించారు. సీఐ చెప్పిన వివరాల్లోకి వెళ్తే.. లావేరు మండలానికి చెందిన వారణాసి చిరంజీవి (38)కి ఏడేళ్ల క్రితం వివాహమైంది. అప్పటికే చిరంజీవి ఒక ఫార్మా కంపెనీలో పనిచేస్తుండేవాడు. సంవత్సరం పాటు విధుల్లోకి వెళ్లినా ఆ తర్వాత సెలవులు ఎక్కువగా పెట్టేయడంతో కంపెనీ తొలగించేసింది. దీంతో శ్రీకాకుళం నగరంలోని పుణ్యపువీధిలో ఒక అద్దె ఇంట్లో నివాసముంటూ కొంత మొత్తాన్ని వడ్డీలకు తిప్పుతూ మొదట్లో బాగానే సంపాదించాడు. ఇదిలా ఉండగా ఈనెల 12వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో భార్య జయశ్రీకి బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటినుంచి చిరంజీవి వెళ్లిపోయాడు. అయితే భార్య తన భర్తకు పలుమార్లు ఫోన్లు చేసినా ఎత్తకపోవడం, అనంతరం భర్త ఫోన్ ఇంట్లోనే దొరకడంతో ఆందోళనకు గురయ్యింది. అతడి ఫోన్ చెక్ చేయగా ఇతరుల నుంచి చాలా మిస్డ్ కాల్స్ ఉండడం, అవే నంబర్ల నుంచి డబ్బులు ఎప్పుడిస్తావంటూ మెసేజ్‌లు ఉండడంతో బంధువుల వద్ద వాకబు చేసింది. అయినా అతని జాడ తెలియకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేసిందని సీఐ తెలియజేశారు.



చిరంజీవి

అక్రమ బదిలీలు రద్దు చేయాలి

శ్రీకాకుళం: కేజీబీవీ ఎస్‌వో (ప్రిన్సిపాల్స్)ల అక్రమ బదిలీలు రద్దు చేయాలని, నిబంధనలు పాటించని ఏపీసీని విధుల నుంచి తొలగించాలని ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, యూటీఎఫ్ సీనియర్ నాయకురాలు కె.విజయగౌరిలు డిమాండ్ చేశారు. జిల్లాలోని కంచిలి, గార, పొందూరు కేజీబీవీల ప్రిన్సిపాల్స్‌ను స్థానిక ఎమ్మెల్యేల లేఖల ఆధారంగా బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీస్ వద్ద సమగ్ర శిక్షా ఎంప్లాయిస్ జేఏసీ, యూటీఎఫ్, సీఐటీయూ సంయుక్తంగా 3 సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలపై విచారణ జరపకుండానే చర్యలు తీసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రిన్సిపాల్స్ బదిలీకి రాష్ట్ర కార్యాలయం అనుమతి తప్పనిసరి అనే నిబంధనను ఉల్లంఘించడమే కాకుండా, బదిలీలకు అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ అని కారణాన్ని పేర్కొనడం ద్వారా వాస్తవాలను దాచే ప్రయత్నం కనిపిస్తోందని విమర్శించారు.



నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల ప్రతినిధులు

అధికారి అత్యుత్సాహం

సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి రాజకీయ ఆశీస్సుల కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ, సెలవు రోజుల్లో కూడా ఆదేశాలు జారీ చేశారని మండిపడ్డారు. మహిళా ఉద్యోగులను స్థానిక రాజకీయ నాయకులు ఇష్టానుసారంగా దూషించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, వేధింపులపై ఫిర్యాదు చేయడంతో పాటు ఫోన్ ఆడియో రికార్డింగ్స్‌ను ఏపీసీకి అందజేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధిత ముగ్గురు ప్రిన్సిపాల్స్ కూడా ఒంటరి మహిళలని, వీరి కుటుంబాలు వీరిపై పూర్తిగా ఆధారపడి ఉన్నాయన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. ధర్నాకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు హాజరై అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, కోశాధికారి అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, యూటీఎఫ్ కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి జి.సురేష్, కె.సురేష్, జి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస ఎమ్మెల్యే వేధిస్తున్నారు

నిరసన కార్యక్రమంలో భాగంగా పొందూరు కేజీబీవీ ఎస్‌వో ఆర్.సౌమ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే నుంచి తనకు ప్రాణహాని ఉందని కన్నీటి పర్యంతమయ్యారు.